
# అనామకుడు

కంఠమనేని రాధాకృష్ణమూర్తి



"పాతివ్రత్యంమీద మీ అభిప్రాయ మేమి టంటారు?"

అతనెవరో నాకు తెలియదు. అరగంట నుంచీ నాఎదురుగా కూర్చుని ఒకటే బోరకొట్టే స్తున్నాడు.

"స్త్రీకి ఆలోచించటం నేర్పిన ఈ ఆధునిక యుగంలో ఇంకా అట్లాంటి వింతమృగం ఉంటుందను కోనండీ," అన్నాను.

విచిత్రంగా చూసాడతను.

"అట్లా అనకండి సార్."

అత నన్నాడు: "జీవితంలో మనకు తటస్థపడనంత మాత్రాన అలాంటి వారు లేరనటం పొరపాటు. అందాకా ఎందుకు! నామట్టుకు నాసంగతి ఆలోచించండి-ఒకప్పుడు నాకూ భార్య ఉండేది. ఓ శుభ దినాన అది ఎవడితోనో లేచి పోయింది. అంత మాత్రాన నాకు స్త్రీల పాతివ్రత్యం మీద విశ్వాసం సడలలేదు. ఉంటారండీ కొందరు దేవతలు...."

మేమున్నది చిన్న కాకా హోటల్లో. మొత్తం ఓ ఏడెనిమిది బల్లలు, కుర్చీలు ఉన్నాయి. నా ఎడం వేపు కౌంటర్ ముందు కూర్చుని ఉన్న గణేశ్ కునికిపాట్లు పడుతున్నాడు. అతని పక్కనున్న చిన్న అద్దాలకేసులోంచి ఎట్టిటి తినుబండారాలు కనిపిస్తున్నాయి. కుడివేపు మూల బల్ల ముందు ఇద్దరు పల్లెటూరి మనుష్యులు నోక్యాడిస్తున్నారు.

బయట సన్నగా వర్షం పడుతోంది.

సర్వర్ని పిలిచి రెండు కాఫీలకు ఆర్డరిచ్చాను.

ఆ రోజు అతను నాతో అంతగా తన గురించి ఎందుకు చెప్పు కున్నాడో నాకిప్పటికీ అర్థంకాని విషయంగానే ఉండిపోయింది. నిజానికి అతనిలాంటి దురదృష్టవంతులు ఈ లోకంలో ఎవ్వరూ ఉండ రేమో! బురదలో పుట్టాడతను. బురదలో పెరిగాడు. అతని ఊరేదో అతనికి తెలియదు. తన కులమేదో, మతమేమిటో అంతకంటే తెలియదు. అతని తల్లి ఈ ఇంట్లోను, ఆ ఇంట్లోను పనులు చేసుకుంటూ, వాళ్ళు పెట్టింది, వీళ్ళు పెట్టింది తింటూ తను బ్రతికింది; కొడుకును పెంచింది. జన్మలో ఆమెకు పెళ్ళి కాలేదు. అయినా కొడుకు పుట్టాడు. అతనికి తండ్రె వరు? అతని కులమేది??-ఇవేవీ అతనికి తెలియవు. అతని తల్లి అతనికెప్పుడూ చెప్పలేదు. చెప్ప టానికి ఇప్పుడామె ఈ లోకంలో లేదుకూడా. ఒక్క మాటలో చెప్పా లంటే అతను అనామకుడు! విచిత్ర మేమిటంటే ఇట్లాంటి అతను కూడా తన జన్మ విషయంలో పెద్ద సంతృప్తిని ఫీలవుతున్నాడు. అతని తల్లి తాశీల్దారు రామశాస్త్రి గారింట్లో పనిచేసింది. ఇంజనీరు చౌదరి గారింట్లో పనిచేసింది. డాక్టరు హాన్సేన్ గారింట్లో పనిచేసింది. వీళ్ళంతా గొప్పవాళ్ళు కారా! వీళ్ళలో అతని తండ్రి ఎవరైనా కావచ్చు. అతని కులం ఏదైనా కావచ్చు. ఎవరికి తెలుసు? అతను

కలెక్టరు సుబ్బారెడ్డిగారి కొడుకేమో! లేక రామశాస్త్రిగారి వల్ల పుట్టిన బ్రాహ్మడేమో!!

చెప్పటం ఆపి చిన్నగా నవ్వా డతను. అతనంత ఫ్రాంకుగా మాట్లాడటం విచిత్రమనిపించింది నాకు. అట్లా మాట్లాడే వాళ్ళలో మనమేదో నిజాయితీని ఫీలవు తాము.

"భలేవారే మీరు!" అన్నాను ఏమీ తోచక.

"అవును సార్," అతనన్నాడు. "నాకిట్లాంటి జన్మనిచ్చినందుకు భగవంతుడు సిగ్గుపడాలిగాని, నా యీ స్థితికి ఏవిధంగానూ కారణం కాని నేను అనవసరంగా సిగ్గెందుకు పడాలి? - అసలు ఏ సుఖ మయినా, ఏ శాంతి అయినా మనస్సును సరిపెట్టుకోవటంలోనే ఉంటుందేమో...."

అతని వీపు రోడ్డువేపుకుంది. నా కెదురుగా ఉన్న వాకిట్లోంచి సన్నటి చినుకుల దారాల్ని చీల్చు కుంటూ రోడ్డుమీద ఉండి ఉండి లారీగాని, కారుగాని పెద్ద శబ్దంతో దూసుకుపోవటం కనిపిస్తోంది.

సర్వర్ గ్లాసుల్తో కాఫీ పట్టు కొచ్చాడు. సిప్ చేస్తూ అతని మొహంకేసి చూడసాగాను. చెప్ప రానంత వికృతంగా ఉందతని మొహం. చిన్న నుదురు. వెంట్రు కలు ఉన్నవా లేవా అన్నట్లున్న పల్చటి కనుబొమలు. చట్టిముక్కు. లావు పెదాలు. చిన్నచిన్న చికిలి కళ్ళు. అందులోనూ ఆ రెంటిలో ఒకటి గాజుది. అతని మూతిమీద మీసంలేదు అప్పూటే గడ్డం చేసు కున్నాడో, లేక అసలు వెంట్రుకలే మొలవలేదో - అతని చెంపలు నున్నగా ఉన్నాయి. ఎడమ చెంపకు పైభాగాన-మంచి కంటికి కొంచెం దిగువగా కుంకుడు గింజంతటి నల్లటి పులిపిరికాయ ఉంది. బుష్ షర్టు వేసుకున్నాడు. లుంగీ.

సాధారణంగా జీవితంలో అన్నీ అమిరిన అదృష్టవంతులే ఆప్టిమిస్టు లుగా ఉంటుండటం జరుగుతుం టుంది, కాని అంత పెద్ద దౌర్భాగ్యు డైన అతనిలోనూ అంత పెద్ద ఆశావాదం ఉండటం నాకు విచిత్ర మనిపించింది. స్త్రీ విషయంలో అతనికి పెద్ద గౌరవాభిప్రాయం ఉంది. ప్రేమించటం ఒక్క స్త్రీకే చాతనవుతుందట! పురుషునిలో ఏఅందానికీ, ఆస్తికీ, చదువుకీ ప్రాధా న్యత నివ్వకుండా ప్రేమించగలుగు తుందట. ఆమె హృదయం అగాధ మైనదట, లోతులు కొలవలేమట. ఒకప్రక్క భర్తతో నిజాయితీగా పాతివ్రత్యం నెరపుతూనే, వేరే

పురుషునికి తన మనసులోని అర్ధాన్ని తను పంచి ఇవ్వగలదట. అందుకే ఆమె అంటే అతనికి భక్తి. గౌరవము, విశ్వాసమూనూ! ఎక్కడో గాని లభ్యంకారట అట్లాంటి ఆడవాళ్ళు. ఏ పూర్వ జన్మ సుకృతమో ఉండాలట మనకు తటస్థపడాలంటే- ఒక మిత్రుడన్నట్లుగా అభిప్రాయాల మ్యూజియం అంటూ దేన్నయినా స్థాపించితే అందులో తెలుగు రచయిత్రుల బుర్రలతోపాటు ఇతడి బ్రెయిన్‌ని కూడా భద్రపరిస్తే బాగుండుననిపించింది నాకు.

'కాని సైకో థియరీకి మీ భావాలు నిలవ్వు మేష్టారూ." అన్నాను.

"థియరీకాదు." అతనన్నాడు. "నా అనుభవంలో జరగబట్టే ఇంత గట్టిగా చెప్పగలుగుతున్నాను. అందాకా ఎందుకు? నా మొహం చూడండి—ఒక అందమైన స్త్రీ ప్రేమించదగ్గ అర్హత గలదేనంటారా? కాదు. నాకు తెలుసు. అయినా ఇట్లాంటి నాకు కూడా ఓ అందాల రాసి హృదయంలో స్థానం లభించింది! అఫ్‌కోర్స్. అది నా గొప్ప కాదు. ఆమె జెనరాసిటీయే నను కోండీ. అది ప్రేమా? దయా? లేక సానుభూతా?? చెప్పలేను. కాని ఆమె పవిత్ర అంతరంగంలో మట్టుకు నాకో స్థిరమైన స్థానం వున్నదన్నది తెలుసు.... ఆమెకు పెళ్ళయింది. అంటే వేరొకరి భార్య. అయినా తన పాతివ్రత్యాని కేమీ భంగం వాటిల్లని విధంగా నన్ను ప్రేమించింది; నాకో స్థానమిచ్చింది. దేవత ఆమె....'

బాగుంది. ఇదేదో ఎయిత్ వండర్‌కి సంబంధించిన విషయంలా కన్పడుతోంది.

"చెప్పండి." అన్నాను ముందుకు జరిగి.

"రమ—అంటే చౌదరిగారి అమ్మాయీ నేనూ"తన్మయత్వంతో అతను చెప్పటం మొదలెట్టాడు....

* *

వాళ్ళిద్దరూ చిన్నప్పట్నించీ కలిసిమెలసి పెరిగారు. అప్పట్లో అతని తల్లి చౌదరిగారింట్లోను, హాస్పెన్ గారింట్లోనూ పనిచేస్తుండేది. ఎప్పుడూ అతను రమను నెత్తిన పెట్టుకుని తిరిగేవాడు. కాలుక్రింద పెట్టనిచ్చేవాడు కాదు. ఆటల్లోగాని. మరెందులోనైనాగాని ఎవరైనా ఆ పిల్లకు అన్యాయం చేశారని తెలిస్తే పులిలా వాళ్ళమీద పడి రక్కేవాడు. ఈ విషయంలో తన కంటే పెద్దవాళ్ళతో కూడా పోట్లాటలు పెట్టుకుని వాళ్ళచేత చావు దెబ్బలు తిని. అతను నీరసంగా పండుకుని మూలిగిన సమయాలూ

ఉన్నాయి. అట్లాంటప్పుడు రమ అతని పక్కనే కూర్చుని దయగా అతని చెంపలు నిమురుతూ ఓదార్చేది. ఒకసారి ఆమె కాలుజారి కాలువలోపడితే అతనుతీసి ప్రాణాలు కాపాడాడు. అప్పుడామె చూపిన చూపుల్ని అతను ఎట్లా మరువ గలడని? అట్లా, అట్లా....అప్పుడ తనికి పన్నెండేళ్లుంటాయి. అతని తల్లి అక్కడ పని మానుకుని వేరే చోట కుదురుకోవటంతో అతను మళ్లీ మూడేళ్ళవరకు రమను చూడ లేక పోయాడు....

కాఫీ త్రాగుతూ కొద్దిసేపు మవునం వహించాడతను. గ్లాసు టేబుల్‌మీదపెట్టి మళ్లీ మొద లెట్టాడు.

తను పెద్దగా చదువుకోలేదు. స్కూల్‌ఫైనల్ పాసయాడు, అంతే అదీ హాన్సేన్‌గారి చలవ వల్ల. ఉద్యోగంకోసం అతను విశాఖపట్ట ణంలో తిరుగుతున్న రోజుల్లో, మూడేళ్ళక్రితం-ఓ రోజు రోడ్డుమీద నడుస్తుండగా అతని కెదురుగా వస్తున్న చిన్నకారొకటి రివ్వున అతణ్ని దాటుకుపోయి,కొద్దిదూరాన కీచుమంటూ ఆగింది. వెనక్కి తిరిగి చూసాడతను. అందులోంచి ఓ స్త్రీ అతణ్ని దగ్గరకు రమ్మన్నట్లు చేయి ఊపింది. వెళ్ళాడు.

"నువ్వు, నువ్వు.— కదూ?" అన్నది నవ్వుతూ.

వెంటనే పోల్చేసాడతను. ఆమె రమ! కారెక్కమంం దతణ్ని.

అప్పటికామెకు పెళ్ళయి నాలు గేళ్ళయింది. భర్త అక్కడే షిప్ యార్డులో పెద్ద ఉద్యోగం చేస్తు న్నాడు.

రమ అతణ్ణి తన ఇంటికి తీసుకు పోయింది. భర్తకు పరిచయం చేసింది. తన చిన్ననాటి మిత్రుడనీ, తనను నీళ్ళ నుంచి రక్షించిన ప్రాణదాత అనీ. ఆమె భర్త చిరునవ్వు నవ్వాడు.వాళ్ళ గారేజిలో అతనికి వసతి కల్పించారు. కొద్ది రోజుల్లోనే ఆమె భర్త అతనికి ఒక కంపెనీలో అటెండరు పోస్టు ఇప్పించాడు....

రమ వాళ్ళు బాగా ఉన్నవాళ్ళు. పైగా ఆమె అభిరుచులు కళాత్మక మైనవి. వాళ్ళ ఇంటి చుట్టూ కాంపౌండు ఉంది. లోపల ఇంటి ముంగిట చక్కటి గార్డెన్, అక్కడ క్కడా ఒకటి రెండు సిమెంటు బెంచీలు.

ఆ రాత్రి అతను ఏమీ తోచక గార్డెన్‌లో మెత్తటి పచ్చికలో పడు కొని పైకి చూస్తున్నాడు. వేసవి కాలం చల్లటిగాలి శరీరానికి హాయి కలిగిస్తోంది. ఒకరకమైన మధురో

హాల్లో అతని కళ్ళు అర మూతలు పడుతున్నాయి. ఆ సమయాన దగ్గరలో ఏదో చప్పుడయినట్లు విని పిస్తే కళ్ళు తెరిచాడతను. రమ! అతనికి కొద్దిదూరంలో నిలబడి ఉంది. నవ్వుతోందామె. చప్పున అతను లేచి కూర్చున్నాడు.

రమ అందం అతని కెప్పుడూ ఒక పజిల్‌లా కనిపిస్తుంటుంది. తెల్లటి పాలకోవాలా ఉంటుందామె వొళ్లు. కళ్ళు కత్తి అంచుల్లా మెరుస్తుంటాయి. ఎదుటిమనిషి గుండెల్ని చీలుస్తూ కదుల్తుంటాయవి. ఆమె నవ్వుతూంటే నోట్లోంచి మల్లెలు రాలినట్లుంటుంది. ఒక్కమాటలో చెప్పాలంటే ఆమెను చూడగానే ఎవరి హృదయమైనా మధురత్వంతో చెమరుస్తుంది.

"ఏమిటి ఆలోచిస్తున్నావు?" అందామె. ఆమె భర్త ఏదో ఊరు వెళ్ళాడట పనిమీద.

ఆమెను చూడగానే అతనికి లేచిపోయిన తన భార్య, చని పోయిన తల్లి, తనారాధించే సమస్త దేవతలూ కళ్లముందు కదిలారు. అతనికి ఎదురుగా కూర్చుని ఉందామె, మోకాళ్ల చుట్టూ చేతులు పెనవేసి, ముందుకు వొరిగి అతని వేపు చూస్తోంది. ఆ క్షణాన అతనికి తన హృదయ కవాటాల్ని తెరిచి తన గత గాథల్ని, బాధల్ని వెళ్ళగించి ఆమె దోసిట్లోపోసి పునీతుడు కావాలనిపించింది. విధి తనకు మొదటినుంచీ అన్యాయం చేసింది. ఏదో శాపప్రభావం తనమీద ఉన్నట్ల నిపిస్తుంది. అప్రతిష్ఠతో కూడుకున్న తన తల్లి జీవితము, తన నిర్భాగ్యత్వము, భార్య వంచన, ముందు జీవితంలో తనకు ఇంక ఆశ ఏముందని? తనిలా అనామకుడుగా ఆరిపోవాల్సిందేనా? ఇట్లాంటి బ్రతుకు బ్రతక్కపోతే మట్టుకు ఏమవుతుంది? తనకోసం ఏడ్చేవాళ్లెవరున్నారని....?

అలా ఆమెతో చెప్పుకుంటుంటే అతని గుండెల్లోంచి దుఃఖం పొంగి పొర్లసాగింది. చటుక్కున ఆమె కాళ్ళు రెండూ వాటేసుకుని ఆమె పాదాలమీద మొహం పెట్టి కన్నీళ్ళు కార్చాడు. అలా ఏడుస్తుంటే అతని కేదో ఆనందంగా, తృప్తిగా అనిపించింది. అతని తలలో చేయిపెట్టి నిమరసాగిందామె.

"కాలమెప్పుడూ ఒకటిగా ఉండదు, నీకూ మంచి రోజులు వస్తాయి" అన్నది.

ఆమె స్పర్శ తగలగానే అతని వొళ్ళు జలదరించింది. అతనిలో మూల మూలల ముడుచుకుని ఉన్న

నరాలు ఒక్కుమ్మడిగా వాళ్ళు విరుచుకున్నాయి. తలెత్తి ఆమె కళ్ళలోకి చూసాడు. గొప్పదయతో చూస్తోందామె తనవేపు. లేచి ఆమె గుండెలమీద తలనానించాడు. ఆమె అభ్యంతరపెట్టలేదు. కొద్దిసేపయాక చప్పున ముందుకు జరిగి ఆమె మొహాన్ని అరచేతుల్లో ఇరికించుకున్నాడు. ఆమె అతణ్ణి తోసేయలేదు. అతడితో పెనుగులాడలేదు. అతని దృష్టంతా ఆమె అందమైన పెదాలమీద ఉంది.

"తప్పుకదూ-తప్పుకదూ. నేను పెళ్ళయినదాన్ని. ఆ య నే మ ను కుంటారు? అన్యాయం కదూ!...." చిన్నగా అరుస్తోందామె.

హఠాత్తుగా ఆమె కళ్ళలోకి చూచి ఉలికిపడ్డాడు. కలవరాన్ని సూచిస్తున్నాయవి. షాక్ కొట్టినట్లయి ఆమెను వదిలేసి ఇవతలికి జరిగి కూర్చున్నాడు. చిన్నప్పణ్ణించీ పవిత్రమైన భావాలమధ్య పెరిగినవాడతను. "క్షమించు" అన్నాడు తలవంచుకుని. "లేదు లేదు, నా ప్రాణదాతవు నువ్వలా అనవద్దు. నే నన్నదల్లా ఏమిటంటే మనం కొన్ని ధర్మాలకు కట్టుబడి ఉండాలని," అన్నదామె. సిగ్గేసిందతనికి. పశ్చాత్తాపం మొదలయిందతనిలో. ఎట్లాంటి పని చేయబోయాడు తాను? ఆమె అరికాలు తాకటానికైనా తనకు అర్హత ఉందా? అప్పటికీ ఆమె దయగానే మాట్లాడుతోంది. కోపగించలేదు. చాచి తన్నలేదు. అది ఆమె ఔన్నత్యాన్ని సూచిస్తోంది. చేతులెత్తి ఆమెకు దణ్ణం పెట్టాడు! చేసిన దుర్మార్గానికి అంతరాత్మ దూషిస్తోంటే, వెంటనే బట్టలు సర్దుకుని ఆ ఇంట్లోంచి బయటికి నడిచాడు శాశ్వతంగా వచ్చేస్తుంటే ఆమె ఇలా అన్నది.

"నే నివ్వాళ ఇలా మనగలుగుతున్నానంటే నువ్వే కారణం. ఆ రోజే నువ్వు నన్ను రక్షించకపోయినట్లయితే నే నీ పా టి కి ప్రాణాల్తో ఉండేదాన్నికాను. నిన్నెన్నటికీ మర్చిపోలేను నేను. నా గుండెల్లో నీకెప్పుడూ ప్రత్యేకమైన స్థానముంది...."

*

"చెప్పండి సార్, ఇప్పుడేమంటారు?" అన్నాడతను ముగించుతూ,

గణేశ్ కూడా ఈ కథ విన్నట్లున్నాడు కౌంటర్ ముందునుంచి లేచి నా పక్క కుర్చీలో కూర్చున్నాడు.

"ఏ విషయంలోనంటారు?" అడిగాడు గణేశ్.

"అదే-స్త్రీ సంగతి- ప్రేమించ

టంలోగాని, పాతివ్రత్యం నెరప టంలోగాని....ఆమె సామర్థ్యం అనండీ, ఔన్నత్యం అనండీ, ఏదైనాగానీ....''

గణేశ్ చాలా తీవ్రభావాలుగల మొరటు మనిషి.

"అయితే ఆమె మిమ్మల్ని ప్రేమించిందంటారు?"వ్యంగ్యంగ అన్నాడు.

అతను కాస్త సిగ్గుపడ్డాడు. సమాధానం ఇవ్వలేక తలవంచు కున్నాడు.

"దాన్ని ప్రేమ అని నే నను కోను" మళ్ళీ అన్నాడు గణేశ్ కఠినంగా

"మీరు చెప్పింది నిజమే అయితే, ఆమెకు మీ మీద జాలి ఉండి ఉండాలి. ఎప్పుడో చిన్న ప్పుడు తన ప్రాణాలు కాపాడి నందుకు అపారమైన కృతజ్ఞత లేక విశ్వాసం అనుకోవచ్చు దాన్ని."

అతను నావేపు కాస్త ఇబ్బందిగా చూసాడు.

"కావచ్చు కాని ఆమె హృద యంలో....

"ఇంకో సంగతి" మధ్యలో అడ్డుకున్నాడతణ్ణి గణేశ్ - "పాతి వ్రత్యం అన్నారు చూసారూ, అదో బోగస్. ఆమే నిజంగా పతివ్రత అయితే మరో పురుషుణ్ణి తన గుండెల మీదగాని, పాదాలమీదగాని వాలనిచ్చి ఉండేది కాదు"

"ఏదో ఒకటి. మొత్తానికి నామీదయితే ఆమెకు ఇష్టం కలిగిం దంటారా లేదా?" ప్రౌఢ్‌గా, పెం కెగా అన్నాడతను.

నవ్వొచ్చింది నాకు. అతని పేడిమొహం. చట్టిముక్కు, బూరె బుగ్గలు గాజుకన్ను. మంచి కంటికి దిగువ నల్లటి పులిపిరికాయ.... ఇట్లాంటి వికృతరూపుడికి ఒక చిన్నదాని మనస్సులో సాఫ్ట్‌కార్నర్ ఉన్నదంటే మనకు నమ్మబుద్ధి కాదు అది నిజమైనాగాని, అందులో వాస్తవం ఎంతైనా కానీండిగాని అతను అలా నమ్ముతున్నాడు. అతని జీవితంలో ఆరిపోతున్న కాన్ఫిడెన్సుకు ఆ నమ్మకం లేక ఆ ఇల్యూషన్ జీవాన్ని పోసి ఉండొచ్చు. తనూ ఒక సార్థవంత మైన జీవేనన్న విశ్వాసం అతని జీవితానికి ఊపిరిపోసి నిలబెట్టి ఉండవచ్చు.

"మరో సంగతి చెప్పమంటారా" గణేశ్ అన్నాడు. "ఆ రోజు నేనే కనక మీ స్థానంలో ఉండి ఉన్నట్ల యితే ఆమె పాతివ్రత్యం నిలిచి ఉండేది కాదు. తప్పనిసరిగా ఆమె సైతాన్‌కి బానిస అయిఉండేది"

"నాకర్థం కావటం లేదు"

అన్నాడతను కోపంగా.

చిన్నగా నవ్వాడు గణేశ్, నా వేపు కన్ను మీటాడు.

"ఇందులో అర్థం కాక పోవటానికేమీలేదు. అద్దంలో మీరొకసారి మొహం చూసుకుంటే అర్థమవుతాయి నా మాటలు!"

ఉలికి పడ్డాను.

గణేశ్ ఆ మాటలు అన్న తక్షణమే అతని మొహం వివర్ణమయి, మరింత వికృతంగా తయారయింది. మనిషి నిలువెల్లా వణికి పోయాడు. అతని పెదాలు, కళ్ళు విపరీతంగా చలించాయి. లేచి గణేశ్‌ని ఖూనీ చేస్తాడేమో ననిపించింది. కాని అదేమీ జరగలేదు. అతను చప్పున లేచి పారిపోతున్న వాడిలా బయటికి పరుగుతీశాడు.

"గణేశ్, నువ్వా మాటలు అనకుండా ఉండాల్సింది," అన్నాను.

నిర్లక్ష్యంగా నవ్వాడు గణేశ్. సిగరెట్టు వెలిగించి కప్పువేపు చూస్తూ పొగపైకి ఊదాడు.

లారీ ఒకటి పెద్దగా చప్పుడు చేసుకుంటూ రోడ్డు మీద పరుగు తీసింది.

ఒక్క నిముషం తర్వాత కీచుమన్న శబ్దం వినిపించింది, ఆ వెంటనే ఎవరో పెద్దగా అరిచారు.

గణేశ్, నేను బయటికి పరుగెత్తాము.

అక్కడి దృశ్యాన్ని చూసి గణేశ్, నేనూ మొహా మొహాలు చూసుకున్నాము. రక్తపుమడుగులో ఒక మనిషి గిలగిలా తన్నుకుంటున్నాడు. అతనెవరో కాదు, అప్పటివరకూ మాతో మాట్లాడిన అనామకుడు! అక్కడ చేరిన వాళ్ల మాట్లాడుకునే మాటల్నిబట్టి అది మామూలు యాక్సిడెంటు కాదనీ, అతను కావాలనే లారీ క్రిందకు వచ్చాడనీ అర్థమైంది. ఆ అనామకుడి ఆత్మహత్యకు కారకుడైన గణేశ్ వేపు చూశాను. గణేశ్ మొహంలో ఏ కోశానా బాధగాని, పశ్చాత్తాపం గాని లేవు. నిర్లక్ష్యంగా అతను పొగ పీలుస్తూ గుప్పుగుప్పున బయటికి వదులుతున్నాడు. మనిషికి అందం, వికృతం ఎలా వుంటాయో - మనస్సుకి తెలుపూ నలుపులూ వుంటాయనేందుకు ఆ అనామకుడూ, గణేశూ చక్కటి ఉదాహరణ అనిపించింది. ఆ అనామకుడు రమ హృదయంలోనే గాక ఇప్పుడు నా హృదయంలోకూడా శాశ్వతంగా నిలబడిపోయాడు. నాకు గణేశ్ హోటల్లో అడుగు పెట్టాలంటే యిప్పుడు భయంగా వుంది. కారణం-గణేష్ కనిపిస్తాడని. ●